ప్రజాశక్తి

సోమవారం 13 జనవరి 2025 5 అనంతపురం



సిపిఎం ఆధ్వర్యంలో
భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం



సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం విధించిన విద్యుత్‌భారాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం భోగిమంటల్లో విద్యుత్‌బిల్లుల దహనం కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలను పెంచడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీలను మరో సారి పెంచడానికి విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ తిరిగి ప్రతిపాదనలు చేసిందన్నారు. దీనివల్ల మరింతగా భారాలు వినియోగదారులపై పడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్‌ఛార్జీల పెంపుదలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులతో సంక్రాంతి భోగి మంటలలో విద్యుత్తు బిల్లులను దహనం చేసే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో, గ్రామాలలో కార్యక్రమాలు చేయాలని తలపెట్టామన్నారు. విద్యుత్ బిల్లుల దహన కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



'బెల్టు' తీయడం సాధ్యమేనా..?

'బెల్టు షాపులు నిర్వహిస్తే ఉపేక్షించం, బెల్ట్ షాపులు నిర్వహిస్తే షాపులకు మొదటి సారి రూ.5 లక్షలు జరిమానా, రెండవ సారి అయితే షాపు లైసెన్స్ రద్దు చేస్తాం' ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్తున్న మాట. కానీ కింది స్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అయితే 'బెల్టు షాపులు నిర్వహించినట్లైతే కలెక్టర్, ఎస్పీ లదే బాధ్యత' అంటూ ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇందులో భాగంగానే శనివారం రోజు ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామాల్లోని అనుమానితుల ఇళు ్ల, గడ్డి వాముల్లో, కళ్లాల్లో సైతం సోదాలు నిర్వహించారు. కానీ ఎన్ని బెల్టు షాపులను మూయించారో పోలీసులే చెప్పాల్సిఉంది.

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఒక్కో గ్రామంలో 4 నుంచి 6 షాపులు
అంతటా అధికార పార్టీ కార్యకర్తలే
అధికారిక షాపులనే కట్టడి చేయలేని వైనం

బహిరంగంగానే 'బెల్టు' షాపులు:

జిల్లా వ్యాప్తంగా 136 లిక్కర్ షాపులు ఉన్నాయి. అందులో 41 నగర పరిధిలో ఉన్నాయి. వీటిలో అత్యధిక షాపులు అధికార పార్టీ నాయకులవే అన్న చర్చ కూడా జరుగుతోంది. నగర పరిధిలోను, జిల్లా వ్యాప్తంగా ఆయా షాపుల పరిధిలో గ్రామగ్రామాన బహిరంగంగానే 'బెల్టు' షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిలో కూడా అత్యధిక శాతం అధికార పార్టీ కార్యకర్తలే అన్నది కూడా బహిరంగ రహస్యమే. ప్రభుత్వం మారిన వెంటనే పోలీసు శాఖను ప్రక్షాళన చేస్తామని ప్రకటించి ఉన్నతాధికారి నుంచి కిందిస్థాయి వరకు తమకు అనుకూలంగా ఉన్న వారినే నియమించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని పోలీసులు బెల్టు షాపులను నియంత్రించడం సాధ్యమేనా అన్న చర్చ ప్రజల్లో జోరుగా సాగుతోంది. ఇందుకు ఉదాహరణ పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్ లో గ్రామాల్లో బహిరంగంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులు కనపడకపోవడమేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నగరంలోని షాపులనే కట్టడి చేయలేని వైనం

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి తిరిగి పాత పాలసీనే అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా టెండర్లను పిలిచి మద్యం షాపులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించింది. ఇందులో భాగంగా నగరంలో 41 మద్యం షాపులు ఉన్నాయి. నిజానికి వీటికి గతంలో మాదిరిగా అధికారిక పర్మిట్ రూములు లేవు. షాపులో మద్యం తీసుకుని షోడా బళ్లు, కూల్ డ్రింక్ షాపులు, లేదంటే ఊరిబయట తాగాలి. అయితే ప్రభుత్వం తమకు ఇస్తున్న కమీషన్ చాలడం లేదని వెంటనే పెంచకపోతే మద్యం అమ్మకాలను నిలిపివేస్తామని షాపుల యజమానులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. దీనికి తోడు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఒక్కో మద్యం షాపు వద్ద 2 నుంచి 3 సెంట్ల స్థలం ఉండేలా చూసి అనధికారిక పర్మిట్ రూములను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు పోలీసులు కూడా ఇతోధికంగా సహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. కారణం షోడా బళ్లు, కూల్ డ్రింక్ షాపులపై దాడులతో పాటు ఎక్కడో అడవిలో చెట్లకింద మద్యం సేవిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు నగరం నడిబొడ్డున ఉన్న లిక్కర్ షాపుల వద్ద ఉన్న అనధికారిక పర్మిట్ రూములు ఎందుకు కనపడటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తప్పనిసరిగా షాపుల వద్ద ఉన్న అనధికారిక పర్మిట్ రూముల్లోనే తాగించేందుకే షోడా బళు ్ల, కూల్ డ్రింక్ షాపులు, ఊరిబయట డ్రోన్లతో మందు తాగకుండా కట్టడి చేశారన్న విమర్శలూ ఉన్నాయి. అయితే బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ప్రకటన చేయడం ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని బెల్టు షాపులను నియంత్రించడం సాధ్యమేనా అని ప్రజల్లో చర్చకు జరుగుతోంది. ఏదిఏమైనా ఇప్పటికైనా జిల్లా ఎస్పీ చొరవతో గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులను తొలగించి తమ కుటుంబాలు బాగుపడేలా చూడాలని గ్రామీణ మహిళలు వేడుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప విమర్శించారు. ఆదివారం పుట్టపుర్తిలో సిపిఎం కార్మిక కర్షక భవనంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అజెండాతో కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. ఈ సంఘం పోరాటంతోనే ఈ రాష్ట్రంలో జస్టిస్ పున్నయ్య కమిషన్ 28 అంశాలు చేర్చారని అన్నారు. వాటిలో డప్పు కళాకారుల పెన్షన్ల కోసం చేసిన పోరాటం ఒకటని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కోసం పోరాడి సాధించిందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ లో ఎలాంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు దళిత కాలనీలో సమస్యలు గుర్తించి ఆ సమస్యలపై పోరాటాలు చేస్తాయన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ తెలియకుండానే మాట్లాడడం సమంజసం కాదన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి. రమణ, రామాంజనేయులు రామాంజప్ప, గోపాల్, మల్లయ్య, జ్యోతి, సరస్వతి, గంగమ్మ, చంద్రమ్మ, సరస్వతి, అనితమ్మ, రత్నమ్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేగాని స్పందించరా..?

ఇంటిపై హైటెన్షన్ విద్యుత్ తీగలు
ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
ఆందోళనలో ప్రజలు



ఇంటికి ఆనుకుని వెళ్తున్న హైటెన్షన్ వైర్లు

ప్రజాశక్తి-గుంతకల్లు

నివాసం ఉంటున్న ఇంటిపైనే 33 కెవి హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లాయి. విద్యుత్ తీగలను తొలగించాలని అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు.. ప్రాణాలు పోతేగానీ అధికారులు స్పందించరా... అంటూ పట్టణంలోని పాత గుంతకల్లు దోనిముక్కల రోడ్డులో నాగప్పగుట్ట ఏరియాలో నివాసం ఉంటున్న పాల్తూరు ఓబులేసు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఓబులేసు మాట్లాడుతూ స్థానిక పాత గుంతకల్లు దోనిముక్కల రోడ్డు నాగప్పగుట్ట ఏరియాలో ఉన్న తన ఇంటిపై 33 కెవి హైటెన్షన్ లైన్ వెళ్లిందన్నారు. అయితే విద్యుత్ తీగలపై పెరిగిన చెట్లకొమ్మలను తొలగించమని విద్యుత్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. 2023 ఏడాది జూలై 27న తమ వీధిలో హైటెన్షన్ విద్యుత్ తీగలపై ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే ప్రయత్నంలో తిరన్నగారి పుల్లన్న, కొడుకు శివకృష్ణ విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను తొలగించమని అప్పటి లైన్ ఇన్స్‌పెక్టర్‌కు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో రెండు నిండు ప్రాణాలు పోయి పెద్ద దిక్కును కోల్పోవాల్సి వచ్చిందన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుటుంబం వీధిపాలైందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలోనే తమ ఇంటిపై కూడా హైటెన్షన్ కరెంటు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఈ విషయమై స్థానిక లైన్ ఇన్స్‌పెక్టర్‌కు తెలపవడంతోపాటు విద్యుత్ శాఖ డిఎఇ అధికారికి వినతిపత్రం అందజేశానన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఇంటిపై వెళ్లిన హైటెన్షన్ విద్యుత్ తీగలకు పరిష్కారం చూపాలని కోరారు.

'ఉపాధి' అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం



పాడిఆవుకు పశుగ్రాసం తినిపిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం

ఉపాధి హామీ పథకం అమలులో అనంత జిల్లాను రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలుపుదామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బెలుగుప్ప మండలం అంకంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు మినీ గోకులం షెడ్లు (పశువుల షెడ్స్)ను కలెక్టర్ ప్రారంభించారు. అంకంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు మదన్ మోహన్, ఎం.భాస్కర్‌కు మినీ గోకులం షెడ్లు ఒక్కొక్కటి రూ.2.30 అంచనా వ్యయంతో మంజూరు చేయగా, అందులో 10 శాతం లబ్ధిదారుల వాటాతో షెడ్లు నిర్మించడం జరిగింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మినీ గోకులం షెడ్లను ఆదివారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.9.62 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన హైడెన్ సిటీ ప్లాంటేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పాఠశాల ఆవరణంలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులం షెడ్లు, హైడెన్ సిటీ ప్లాంటేషన్‌ను ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లాకు అత్యధికంగా మినీ గోకులం షెడ్లు మంజూరు శారని రెండవ స్థానంలో అనంతపురం జిల్లా ఉందన్నారు. జిల్లాలో 1,627 షెడ్లు మంజూరు చేయగా ఇప్పటివరకు 600కు పైగా మినీ గోకులం షెడ్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేయడంలో జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. గ్రామాల్లో పశువుల పై ఆధారపడి జీవిస్తున్న రైతాంగానికి మేలు చేయాలని మినీ గోకులం షెడ్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. మినీ గోకులం షెడ్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. షెడ్లు కావాలని ఎవరైనా అడిగితే ఎంపీడీవో ద్వారా పంపిస్తే వాటిని కూడా మంజూరు చేస్తామన్నారు. మంజూరు తీసుకున్న వాటిని వేగంగా పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించి ఇసుక, సిమెంట్, ఇతర మెటీరియల్‌ను తెప్పించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మినీ గోకులం షెడ్ల మంజూరు, నిర్మాణంలో బాగా పనిచేస్తున్న డ్వామా పీడీని, అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. రానున్న వేసవిలో ఉపాధి హామీ పథకం కింద పొలాల్లో ఉపాధి పనులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో శ్రీకాకుళం, అనంతపురం, ప్రకాశం జిల్లాలలో పొటెన్షియల్ బాగా ఎక్కువ ఉందని, పథకం అమలులో అనంత జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, నిత్యం ఈ పథకంపై సమీక్ష నిర్వహిస్తూ పనులు బాగా కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, వెటర్నరీ ఏడి శ్రీనివాస గుప్తా, ఎంపీపీ పెద్దన్న, జెడ్పిటిసి మమత, సర్పంచి రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, తహశీల్దార్ షర్మిల, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో సూర్యప్రకాష్, వెటర్నరీ డాక్టర్ రమేష్, కళ్యాణదుర్గం డాక్టర్ మంజునాథ్, ఆర్ఐ రమాదేవి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోండి
కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

పేద విద్యార్థులకు మోసం

బకాయి ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించాలి-ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద, మధ్యతరగతి విద్యార్థులను మోసం చేస్తూ కాలయాపన చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధూ విమర్శించారు. ఆదివారం నగరంలోని గనేనాయక్ భవనంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ప్రతిపక్షంలో ఉండగా చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా పెండింగ్‌లో ఉన్న వసతిదీవెన, విద్యాదీవెన బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అంతేగాకుండా కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను తీవ్రమైన ఇబ్బందులు పెడుతున్నారని, తాము అధికారంలోకి విద్యార్థుల బాధలన్నీ తీరుస్తామన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ వసతిదీవెన, విద్యదీవెన బకాయిలు రూ.3,480 కోట్లు ఉండగా ప్రభుత్వం మాత్రం కేవలం రూ.788కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం బాధాకరమన్నారు. విద్యాశాఖ మంత్రి మరోసారి పునరాలోచించుకుని పండగ సెలవులు పూర్తయ్యేలోపు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ విడుదల చేయాని డిమాండ్ చేశారు. ఇకపోతే తల్లికి వందనం 2024-2025 విద్యా సంవత్సరానికి అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, తరిమెల గిరి, సూర్యప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శిలు వెంకటేష్, భీమేష్, వంశీ, జిల్లా కమిటీ సభ్యులు సాయి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుతో రైతులకు లాభాలు

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పండ్ల తోటల వల్ల రైతు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు పంటలు పెట్టి నష్టపోతున్నారు. వేరుశనగ పంట జిల్లాలో ప్రధాన పంటగా పెట్టే రైతులు ప్రతిసారి నష్టపోతూనే ఉన్నారు. వ్యవసాయం జూదంలా మారిపోయింది. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం ఉండదు. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో రైతులు నిరాశకు గురవుతూ అప్పుల ఊబిలో బయటపడలేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరిగిపోయి తీర్చే మార్గం లేక కొందరు ఆత్మహత్యకు సైతం పాల్పడుతున్నారు. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో నూతన వంగడాలతో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతోంది. ముఖ్యంగా తక్కువ నీటి తడులతో అధిక లాభాలు పండ్ల తోటల పెంపకం వల్ల పొందవచ్చని భావించి ప్రభుత్వం అందుకు అనుకూలంగా డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీతో అందిస్తూ ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా నేల స్వభావం బట్టి జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. సత్య సాయి జిల్లాలో ఎర్ర నేలలు పండ్ల తోటల పెంపకానికి అనుకూలం. ఈ నేపథ్యంలో పండ్ల తోటల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.



ప్రశ్న: జిల్లాలో ఏయే పండ్ల మొక్కల పెంపకం చేపట్టవచ్చు.? ప్రస్తుత విస్తీర్ణం ఎంత.?

జవాబు: జిల్లాలో ఎక్కువ భాగం ఎర్ర నేలలు ఉండడంతో పండ్ల తోటల పెంపకానికి అనుకూలంగా ఉంది. మామిడి, చీనీ, దానిమ్మ, సపోటా, అరటి, బొప్పాయి, ద్రాక్ష, జామ, అంజూరా పండ్ల మొక్కలు పెంచుకోవచ్చు. మొత్తం1699. 22 హెక్టార్లలో పండ్ల మొక్కల పెంపకం లక్ష్యం కాగా 1579.50 హెక్టార్లలో పెంపకం జరుగుతోంది. 1524 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: నీటి వనరులు కల్పించడానికి చేపడుతున్న చర్యలు ఏమిటి.?

జ : ప్రభుత్వం అనేక పథకాల ద్వారా నీటి వనరులు సమకూరుస్తోంది. అందులో డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తమ శాఖ ద్వారా చిన్నపాటి కుంటలు, ఫారం ఫండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఫారం ఫండ్స్ లక్ష్యం 33 చోట్ల కాగా రూ. 82.5 లక్షలతో ఆ 33 చోట్ల ఫారంఫండ్స్ నిర్మించడం జరిగింది. 33 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: మీ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు ఏమిటి.?

జ: జిల్లాలో నూతన పండ్ల తోటల విస్తరణ, రెండు మూడు సంవత్సరాల అనంతరం రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుంది. నీటి వనరుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. కోత అనంతరం తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు వివరిస్తాం. ఇందులో భాగంగానే రైతులకు తగిన శిక్షణలు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వం నుంచి అందే డ్రిప్, స్ప్రింక్లర్ల గురించి వివరిస్తున్నాం. సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు సబ్సిడీ ద్వారా అందిస్తాం.

ప్ర: జిల్లాలో ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరింది.?

జ: పండ్ల తోటల పెంపకం, ఇతర సదుపాయాల ద్వారా 5100 మంది లబ్ధి పొందారు. ఆర్థికంగా రూ. 564.53 లక్షల వరకు వివిధ రకాలుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. అలాగే హైబ్రిడ్ కూరగాయల పంటల ద్వారా కూడా రైతులు లబ్ధి పొందుతున్నారు.

ప్ర: రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ: ఒకే రకమైన పంటల ద్వారా కాకుండా, పండ్ల మొక్కల పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను రైతులు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలి. రెండు మూడు రోజులకు ఒకసారి మరికొన్ని వారానికి ఒకసారి నీటి తడులు అందించే మొక్కలను నీటి లభ్యత బట్టి పెంచుకోవాలి. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోంది. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మొక్కలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి. నూతన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తూ అభివృద్ధి చెందాలి.



జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్



ముగ్గుల పోటీలను పర్యవేక్షిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల

సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతులు, బాలికలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో కాలనీకి చెందిన మంజుల మొదటి స్థానం, ప్రణవి రెండవ స్థానం, పుష్పా మూడవ స్థానంలో నిలిచారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటలక్ష్మి, శ్యామల, మహిళా సంఘం నాయకులు డి.కృష్ణవేణి, షేక్ శంషాద్, జి.రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడితే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-బెలుగుప్ప

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం మండల పరిధిలోని అంకంపల్లిలో కోడిపందేలు నిర్వహించుట, ఆడటం నేరమనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు ఆడటం చట్టరీత్యా నేరమన్నారు. కోడిపందేలు ఆడినా, నిర్వహించినా, పాల్గొన్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, సహాయ సంచాలకులు శ్రీనివాస్‌గుప్తా, బెలుగుప్ప పశువైద్యాధికారి రమేష్, కళ్యాణదుర్గం మండల పశువైద్యాధికారి డాక్టర్ మంజునాథ్, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రులు, పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్



క్రీడాకారులతో విప్ కాలవ శ్రీనివాసులు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పయ్యావుల అనిల్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ కబడ్డీ పోటీ రాష్ట్రంలో సంప్రదాయ క్రీడ అన్నారు. అలాంటి క్రీడలను మండలంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి, తుంగభద్ర జలాశయం సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ సాగర్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని నార్పల్లో క్రాసింగ్ సమీపంలో ఈనెల 18,19వ తేదీల్లో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఇస్తేమా ఏర్పాట్లను ఎస్ఐ సాగర్ ఆదివారం పరిశీలించారు. ఇస్తేమాకు జిల్లావ్యాప్తంగా ఎంతమంది వస్తారు.. ప్రార్థనలు జరిగే ప్రదేశం ఎక్కడ.. వాహనాల పార్కింగ్ ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయాలను స్థానిక మత పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇస్తేమాను శాంతియుతంగా సజావుగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి : టిడిపి సీనియర్ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి కుమారుడు చవ్వా విష్ణువర్ధన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం మండల పరిధిలోని రాయలచెరువు, గ్రామం నగరూరు రోడ్డులో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మందుగా చవ్వా ఫ్యామిలీ అభిమాని కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గండికోట లక్ష్మణ్, లీలావతి, ఆశ్రమ నిర్వాహకులు పరిమి కృష్ణవేణి, వృద్ధులు, చిన్నారులు, గండికోట మహిమ స్వరూప, జాషువా, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యాసరాలు అందజేత

గుత్తి : పట్టణంలోని కొత్తూరు లో ఉన్న స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమానికి దాతలు ఆదివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. గుత్తికి చెందిన టైలర్ నాగేంద్ర(లేట్) కుమారుడు మధు జ్ఞాపకార్థం అతడి జన్మదినాన్ని పురస్కరించుకుని యువకుడి తల్లి లలితమ్మ ఆశ్రమానికి వెళ్లి 30 కిలోల బియ్యం బస్తా, కూరగాయలు, తిను బండారాలు ఆశ్రమం నిర్వాహకులకు ఇచ్చారు. ముందుగా కేకును కోసి పంచిపెట్టారు.

కలెక్టర్, ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా ప్రజలకు కలెక్టర్ వినోద్‌కుమార్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, సిరిసంపదలతో తులతూగుతూ ఉండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి అనగా నూతన క్రాంతి అని, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారని, ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. ప్రజలంతా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవా లన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు కలెక్టర్ తెలిపారు.

అనంతపురం క్రైం : భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని ఎస్పీ పి.జగదీష్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది సంతోషంగా సంక్రాంతి పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి, కనుమలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో మాజీ సర్పంచి అట్టే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాస్తున్న ఏకైన దినపత్రిక ప్రజాశక్తి అన్నారు. అలాంటి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏకిల ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, అట్లే శంకర, లక్ష్మయ్య, ఎర్రిస్వామి, అట్టే సురేష్, అట్టే కామేష్, జానుగొండ కైలాస్, బేళ్ల తరుణ్, అట్టే హర్షవర్ధన్, అట్టే చెంగల్, అట్టే అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచు రామాంజనేయులు, యువకులు

విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేయండి

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సంక్రాంతి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిఎం చంద్రబాబు గత సార్వత్రిక ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే విద్యుత్ ఛార్జీలు పెంచడం బాధాకరమన్నారు. కూటమి నాయకులు ఎన్నికలప్పుడు ఒకమాట.. ఎన్నికల అయిపోయాక మరోమాట మాట్లాడటం తగదన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండని నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారన్నారు. అయితే టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లను అమలు చేయడం ఎంతవరకూ కరెక్టో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల కోట్ల రూపాయల కరెంటు ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతోందన్నారు. కరెంటు ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా సిపిఎం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు.

అనంతపురం కలెక్టరేట్ : పెరిగిన విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న సంక్రాంతి భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమానికి కార్మికులు హాజరై జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన పని చేస్తామని ఎన్నికల హామీలిచ్చి ఇప్పుడు విద్యుత్ భారాలు మోపడం అన్యాయంగా ఉందన్నారు. రూ.6072 కోట్లు సర్దుబాటు పేరుతో భారాల పోటు వినియోగదారులపై మోపుతోందన్నారు. మూడు రకాల సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. జనవరి నెల నుంచి మరో సర్దు'పోటు'తో మొత్తం రూ.15,484 కోట్లు విద్యుత్ భారం మోపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానికి దోచిపెట్టేందుకు పాలకులు పాకులాడుతున్నారని విమర్శించారు. కార్మిక వర్గం మరో విద్యుత్ పోరుకు సిద్ధం కావాలని అందులో భాగంగా భోగి మంటలలో విద్యుత్ బిల్లులు దహనం చేద్దామని పిలుపునిచ్చారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై వివిధ ఛార్జీల భారాన్ని మోపడం నిరసిస్తూ ఈనెల 13న భోగి పండుగ సందర్భంగా విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే పేదలపై విద్యుత్ భారాలు మోపడం బాధాకమరన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇళ్లలో నుంచి బయటకు వచ్చి విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

బుక్కరాయసముద్ర : మండల వ్యాప్తంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం చేసి నిరసన తెలపాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పేదలపై విద్యుత్ భారాలో మోపడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

శింగనమల : పేదలపై రూ.16 వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారం మోపడాన్ని నిరసిస్తూ ప్రతి ఒక్కరూ విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన తెలపాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

'పల్లెపండుగలో' విప్ కాలవ శ్రీనివాసులు



పింఛన్ కోసం విప్ కాలవ శ్రీనివాసులుకు దరఖాస్తు అందజేస్తున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా టిడిపి కన్వీనర్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని కొలగానహళ్లి గ్రామంలో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని రోడ్లకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే రోడ్ల నిర్మాణాలను పూర్తి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. దీంతో ప్రజల్లో సిఎం చంద్రబాబుపై నమ్మకం పెరిగిందన్నారు. కాగా పలువురు సమస్యలపై విన్నవించారు. ఇందులో భాగంగానే గతంలో వస్తున్న పింఛన్‌ను ఐదేళ్ల క్రితం తీసివేశారని, మీరైనా పునరుద్ధరించాలని కోరారు. అలాగే మైలాపురం నుంచి ఎలంజి గ్రామం మీదుగా రాయదుర్గానికి బస్సు నడపాలని టిడిపి నాయకులు మైలాపురం నాగరాజు, రామాంజనేయులు వినతిపత్రం అందజేశారు.కలగాలన నుండి తిమ్మాలాపురం వెళ్లే గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు శ్యామలమ్మ, రవి, ఈశ్వరప్ప విజ్ఞప్తి చేశారు. వీటితోతోపాటు హెచ్చెల్సీ నుంచి కృష్ణాపురం మీదుగా లింగరాలకు వెళ్లే కాలువకు బీటీ రద్దు వేయాలని గ్రామానికి చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ ఆయా సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

గుంతకల్లు రూరల్ : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని నాగసముద్రం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. రైతులకు పంటలు పండాలంటే పాడి ముఖ్యమైందన్నారు. పంటలతోపాటు పాడి కూడా రైతుకు ఆదాయాన్ని చేకూర్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మినీ గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గంలో రూ.140 కోట్లతో సిసి రోడ్ల నిర్మించినట్లు తెలిపారు. అనంతరం మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపిపి వాల్మీకి మాధవి, జడ్పిటిసి కదిరప్ప, జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, టిడిపి నాయకులు కసాపురం దేవేంద్ర, బండారు ఆనంద్, లాయర్ కృష్ణారెడ్డి, నాగసముద్రం ధనంజయ, ఛైర్మన్ మునుస్వామి, తహశీల్దార్ రమాదేవి, ఇఒఆర్‌డి నాగభూషణం, ఎపిఒ కృష్ణమూర్తి, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన




నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని బళ్లారి మిట్టపై నుంచి అంబేద్కర్ గారి విగ్రహం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఈరన్న, కుందుర్పి మండల కన్వీనర్ బొజ్జప్ప యాదవ్, శెట్టూరు మండల కన్వీనర్ మల్లయ్యయాదవ్, కంబదూరు మండల కన్వీనర్ మధుసూదన్, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ సన్నప్పయ్య, కళ్యాణదుర్గం పట్టణ కన్వీనర్ బోయ నాగరాజు, కళ్యాణదుర్గం రూరల్ మండల కన్వీనర్ పాతన్న, సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, సీనియర్ నాయకులు ఫక్రుద్దీన్‌సాబ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ దాదా, కళ్యాణదుర్గం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కె. ఉద్దీప్ సింహా, కళ్యాణదుర్గం పట్టణ కార్యదర్శి మాల ఈశ్వర ప్రసాద్, నాయకులు శివరాజు, తిప్పేస్వామి, ధనుంజయ, ధనుంజయ, టీ.గురుస్వామి, దామోదర్, సత్యనారాయణ, నాగేంద్ర, హనుమంతప్ప, రమేష్, గఫర్ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పాటుపడదాం

సంఘమిత్ర కార్యక్రమంలో వక్తలు



ప్రముఖులకు నివాళులర్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నిరంతరం సమాజ హితం కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందరం దేశాభివృద్ధికి చేయూతనిద్దామని భారత వికాస సంఘం కన్వీనర్ మాధవరెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికాంత్ రమణ ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని అనంతపూర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రజా గాయకులు ఎస్కే లెనిన్ బాబు అధ్యక్షతన ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు, ఎఎఫ్ ఎకాలజీ సెంటర్, మీనాక్షమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'సంఘమిత్ర' పేరుతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వివేకానంద, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, మీనాక్షమ్మల స్ఫూర్తితో స్వచ్ఛంద సంస్థలుగా, సామాజిక బాధ్యత ఉన్న వ్యక్తులుగా మంచి కార్యాచరణను రూపొందించుకుని, ఒకరికొకరు సహకరించుకుని సేవలను సమాజానికి అందిద్దామని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి విచ్చేసిన వికాస్, సురేష్ గుప్తా, డిస్కవర్ అనంతపురం అనిల్, ప్రముఖ రచయిత్రి శశికళ, ప్రొఫెసర్ గంగిరెడ్డి, వదాన్య జన సొసైటీ అశోక్, అనంత నేచురల్స్ పార్థసారథి, ప్రకృతి వ్యవసాయ రైతు నాగరాజు, బద్దేనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేత నంద్యాల

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు గ్రామస్తుల ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఎపి రాష్ట్రవ్యాప్త ఓపెన్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో నంద్యాల నంది ఫైవ్స్ క్రీడా జట్టు విజేతగా నిలిచింది. నంద్యాల జట్టుకు పారిశ్రామికవేత్త మాదాల రామకృష్ణ పరమహంస రూ.20,116, ద్వితీయ బహుమతి కత్తి రమేష్‌బాబు, ఎరువుల అంగడి సూరి ఉమ్మడిగా విశాఖపట్నం జట్టుకు రూ.15,116, తృతీయ బహుమతి వాసిమ్ రాజా బనగానపల్లి జట్టుకు రూ.10,116, 4వ బహుమతి రాయలచెరువు జట్టుకు దాత రాజశేఖర్ రూ.5,116 నగదుతోపాటు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మాదాల రామకృష్ణ పరమహంస, ఎరువుల అంగడి సూరి, వాసిం రాజా, రాజశేఖర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, పామిడి ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని 8వ వార్డులో విశ్రాంత ఉపాధ్యాయుడు మానికింద రామాంజనేయులు సొంత నిధులతో 70 టిడిపి సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి అశ్వర్థమయ్య, టిడిపి నాయకుడు మానికింద బాబు, ఐటిడిపి అధ్యక్షులు ఆవుల శివ, మానికింద ఆకాష్, మానికింద సాయి, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టిడిపి నాయకులు

గుత్తి ఆర్ఎస్ వాసి సునీల్‌కు డాక్టరేట్


ప్రజాశక్తి-గుత్తి



గుత్తి ఆర్ఎస్‌లో నివాసం ఉండే ప్రొద్దుటూరు సునీల్‌కు డాక్టరేట్ దక్కింది. తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్ గ్రామంలోని ఎన్బికెఆర్ ఐఎస్టి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకుడు ప్రొద్దుటూరు సునీల్ కి డాక్టరేట్ లభించింది. 'స్ట్రెంతనింగ్ ది రిలయబిలిటీచ కంజెషన్ కంట్రోల్ అఫ్ ఫ్లయింగ్ అడహక్ నెట్‌వర్క్ బై ఇంప్లిమెంటింగ్ మల్టిపాత్ రౌటింగ్ ప్రొటొకాల్స్ టు డిజైన్ ఎన్ ఇమ్యుక్కులెట్ అండ్ డెక్స్ట్రస్ టోపోలాజీ ఫర్ సెక్యూర్ డేటా ట్రాన్స్మిషన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సునీల్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందిన సునీల్‌ను విభాగాధిపతి ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి, తోటి అధ్యాపకులు, మిత్రులు ఆర్.సొలమన్‌రాజా అభినందించారు.

పోలీసులకు బకాయిల చెల్లింపుపై హర్షం

బుక్కరాయసముద్రం : పోలీసులకు బకాయిలను ప్రభుత్వం చెల్లించడంపై 14వ బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ టి.పెద్దయ్య ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పోలీసులకు సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న 2024 జనవరి నుంచి అడిషనల్ సరెండర్ లీవ్ బకాయిలు, జూన్ వరకూ సప్లిమెంటరీ సరెండర్ లీవ్ బిల్లు, జిపిఎఫ్, సిపిఎస్ ఉద్యోగుల బకాయిలను చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



సాంబశివారెడ్డి, వీరాంజనేయులును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వి.నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మినారాయణ అన్నారు. తమకు పదవులు వచ్చేందుకు సహకరించిన వైసిపి నియోజకవర్గ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి నివాసంలో నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులుతో కలిసి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈక సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాస్‌నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ జిల్లాల యువజన అధ్యక్షులు డి.భాస్కర్‌నాయక్, జిపిఎస్ నాయకులు ఎం.రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయికుమార్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయసాయికుమార్


అనంతపురం : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మైసూరులో ఫాన్ ఇండియన్ సోషల్ కల్చరల్ అసోసియేషన్ అందజేసిన ఇన్స్‌పైర్ రాయల్ ఎక్సలెన్సీ అవార్డును సాయి అధ్యక్షుడు విజయ సాయికుమార్ అందుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమెరికన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మధుకిషన్ అవార్డును అందజేశారు.

48 యూనిట్లు మంజూరు

పామిడి : మండలానికి 2024-25 సంవత్సరానికి స్వయం ఉపాధి కింద 48 యూనిట్ల రుణాలు మంజూరైనట్లు ఎంపిడిఒ తేజోష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెనరిక్ మెడికల్ షాపులకు బీసీ-1, ఈబీసీ-1, స్వయం ఉపాధికి బిసి-42, ఈబీసీ-4 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలకునే వారు వయసు 21ఏళ్ల నుంచి 60ఏళ్లలోపు ఉండాలన్నారు. బిపిఎల్ కుటుంబ సభ్యులు అయి ఉండి, ఆధార్ కార్డు, రేషన్‌కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ లింకు ఉన్న ఫోన్ నెంబర్ ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈనెల 16వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాల్గోతరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం



నూతన సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఎపి ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం ఎన్నికలు . రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ముగిశాయి. నగర అధ్యక్షులుగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పక్కరుల్లా ఖాన్, కిరణ్, కార్యదర్శిగా జాఫర్‌వలి, సంయుక్త కార్యదర్శిగా మదార్ సాహెబ్, ఈశ్వరయ్య, కోశాధికారిగా బివి.రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాలుగో తరగతి ఉద్యోగులందరూ అభినందించారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గం ఉద్యోగుల సమస్యల కోసం సాయి శక్తులా కృషి చేస్తామని తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాచూరే సునీతాబాయి

ప్రజాశక్తి-తాడిపత్రి

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆలయ పాలక వర్గ సభ్యులు, మహిళ మండలి సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవేస్ కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాచురే సునీతాబాయి, రాష్ట్ర స్వకుల సాలి సమాజం రాష్ట్ర అధ్యక్షులు కాంబ్లె నాగేష్, తాడిపత్రి స్వకుల సాలి సమాజం ప్రెసిడెంట్ కేంద్రోలే చంద్రశేఖర్, మహిళ మండలి ప్రెసిడెంట్ మంజుల వాణి, సెక్రటరీ శారద, చంద్రకళ, సఫరె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బల్లా పల్లవి దంపతులకు టిడిపి శాశ్వత సభ్యత్వం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన మేరకు మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి దంపతులు ఆదివారం టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈమేరకు టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సమక్షంలో ఆదివారం నగరంలోని జిల్లా కార్యాలయంలో బల్లా పల్లవితోపాటు బల్లా సురేష్‌కు శాశ్వత సభ్యత్వాల నమోదు కార్డులు అందజేశారు. తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి, జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, రాష్ట్ర బెస్త సాధికార సభ్యులు మెకా షణ్ముఖ, లక్ష్మీ నాయుడమ్మ, పూల బాషా, శిరసాల రాంబాబు, కొండాపురం పవన్ చౌదరి, బండి అనిల్ కుమార్, ఎన్.బి.కే నారాయణస్వామి, రాయల్ లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న బల్లా పల్లవి దంపతులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

డి.హీరేహాల్ : మండల పరిధిలోని లింగమనహల్లి గ్రామ సమీపంలో ఉన్న అంతర్ రాష్ట్ర రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.హీరేహాల్‌కు చెందిన నవీన్‌కుమార్ (38) మృతిచెందాడు. ఎస్ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నవీన్‌కుమార్ తమ్మేపల్లి గ్రామ సమీపంలో కర్ణాటక సరిహద్దున ఉన్న ఓ డాబాలో వంట మనిషిగా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం కూడా తన పని ముగించుకుని డి.హీరేహాల్‌లో ఉన్న ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. లింగమనహలి గ్రామ సమీపంలో అంతర్ రాష్ట్ర రహదారిపై బెంగళూరు నుంచి బళ్లారికి వెళ్తున్న లారీ వెనకు నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దుకాణాల్లో చోరీ

గుత్తి : మండల కేంద్రంలోని తాడిపత్రి రోడ్డులో శనివారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. శ్రీ వినాయక ట్రేడర్స్, సమ్రిన్ ట్రేడర్స్ అనే దుకాణాల పైకప్పులపై దొంగలు రంధ్రాలు వేసి లోనికి ప్రవేశించారు. షాపుల్లో రూ.10వేల నగదు,6 సెల్ ఫోన్ల ను దుండగులు దోచుకువెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. దుకాణాల్లోని సిసి ఫుటేజ్ ల రికార్డుల ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్


ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందనిఈ భారాల పెరుగుదలను నిరసిస్తూ విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ధర్మవరం కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేరుతో 15 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. వచ్చే మార్చి నుండి మరో 14 వేల కోట్ల రూపాయల భారం వేయడానికి సిద్ధమవుతోందని విమర్శించారు. విద్యుత్ భారాలకు గత ప్రభుత్వం కారణమైతే ఎందుకు సెకి ఒప్పందం రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు కుదించి, మరోవైపు భారాలు వేయడంపై ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. అదానీ కంపెనీ లాభాల కోసం ప్రజలను బలిపెట్టే విధానాలు ఉపసంహరించు కోవాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని ,నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తామని తెలుగుదేశం కూటమి ఎన్నికల హామీ ఇచ్చి ,అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచుతోందన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండని నారా లోకేష్ ప్రజలకు పిలుపు ఇచ్చి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లను అమలు చేస్తున్నారని విమర్శించారు. కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా సిపిఎం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఎస్‌హెచ్. బాషా, మారుతీ, జెవి. రమణ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఉరవకొండ : శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6, 7, 8, 9వతేదీల్లో నిర్వహించనున్న అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్రేష్, సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు, లోగోలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, నవీన్, ఉరవకొండ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న మేయర్



ఆర్ట్స్ కళాశాలలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఎస్వీ కళాశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ చిన్నతనం నుంచే స్వామి వివేకానంద ఆధ్యాత్మికత వైపు నడిచి యువతను సన్మార్గం వైపు నడిపారన్నారు. అంతేగాకుండా యువశక్తి అణుశక్తి కంటే బలమైనదని యువజన చైతన్యమే లక్ష్యంగా యువత భాగస్వామ్యాన్ని దేశ అభివృద్ధికి బాటలు వేసేలా భారతీయ సంస్కృతి సంప్రదాయాలు దేశ విదేశాల్లో చాటి చెప్పిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,సైపుల్లా బేగ్, ఇషాక్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డులో ఉన్న ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ కార్యదర్శి జి. ప్రసిల్లా అధ్యక్షతన స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రమేష్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహాయ కార్యదర్శి షేర్ చాందిని, అలేఖ్య, ముత్యాలమ్మ, పి.లావణ్య, ప్రగతిపథం సభ్యులు నాగ శివ, కె.విశ్వనాథ్, కె.మల్లికార్జున, సి.కుమార్, ఉత్తరాంచల్ యూనివర్సిటీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థి రిత్విక్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నేటి యువతరం వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, జాతీయ సేవాపథకం అధికారులు జి.ఆనంద్ బాబు, ఎస్.పురుషోత్తం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వివేకానంద స్ఫూర్తితో యువత దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శారదాదేవి ట్రస్టు నిర్వాహకులు అర్చనానంద తెలిపారు. పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయదుర్గ్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జయంతిని సంయుక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అంబాజీరావు, శారద ట్రస్టు నిర్వాహకులు అర్చనానంద, క్లబ్ కార్యదర్శి అశోక్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు శంకర్, ధనార్జన, శ్రీనివాసులు, ఉమామహేశ్వరయ్య, వెంకట రమేష్, అబ్దుల్లా, శారదా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ విద్యాసంస్థల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహినంచారు. ఇందులో భాగంగా విజన్ హై స్కూల్ కరస్పాండెంట్ లియో క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ్, లియో క్లబ్ ఆఫ్ యాడికి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లియో సభ్యులు రఘు, వెంకటరాముడు, హరి, తిరు, రసుల్, అమర్, హేమంత్, యువరాజ్, జయవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో పుట్లూరు యూత్ రవి, ఆంజనేయులు, దేవరాజు, సునీల్, స్వార్తిక్, ప్రకాష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, విశ్రాంత ప్రన్సిపాల్ రంగస్వామి, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.బాలాజీనాయక్, విష్ణుప్రియ, సోమశేఖర్, 1989-92 అల్యూమిని బ్యాచ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గుత్తి : యువత ఆశాజ్యోతి, నిత్య స్ఫూర్తిదాత స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం గుత్తిలో గ్రంథాలయాధికారి హెచ్. రామాంజినేయులు ఆధ్వర్యంలో చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎం. వీరాంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వినోద్ కుమార్, రఘు, ప్రశాంత్, మల్లికార్జున, ఎన్సిసి క్యాడెట్లు మరియు ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



గుత్తిలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



అనంతపురంలో స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

'పల్లె నిద్ర'లో పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గ్రామాలు, కాలనీల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలు, కాలనీలో పోలీసులు శనివారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామస్తులతో సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సమస్యలు తీవ్రం కాకుండా ప్రారంభ దశలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు, సైబర్ మోసాలు గురించి అవగాహన చేశారు. డిజిటల్ అరెస్టు, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఎపికె ఫైల్స్ ఫ్రాడ్స్, తదితర మోసాలు గురించి వివరించారు. డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని, అపరిచితుల కాల్స్, లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఒటిపిలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో జిల్లాలో ఆదివారం విజిబుల్ పోలీసింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకూ జిల్లా అంతటా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు. హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని, ఓవర్లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు.



'పల్లె నిద్ర'లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు